
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





విగ్రహాన్ని చెక్కుతున్న బాలప్ప

భళా.. బాలప్ప!

వందకు పైగా ఆలయాలకు విగ్రహాల సరఫరా

దేవతా విగ్రహాలకు కేరాఫ్‌గా మారిన తాపీమేస్త్రీ

పక్క రాష్ట్రాలవారూ ఇక్కడికే

ఒకప్పుడు ఉపాధి కోసం పక్క రాష్ట్రానికి వలస వెళ్లిన వ్యక్తి.. కళాకారుడిగా తన ప్రాంతానికే గుర్తింపు తెచ్చాడు. అప్పట్లో పని కోసం ఎక్కడెక్కడికో వెళ్లగా.. ఇప్పుడు తనతో పని చేయించుకోవాలని పక్క రాష్ట్రాల నుంచి సైతం వెతుక్కుంటూ వస్తున్నారు. వందకు పైగా ఆలయాలకు దేవతా విగ్రహాలు చెక్కిన కంగ్టి మండలం సిద్ధంగిర్గా గ్రామానికి చెందిన శిల్పి సాగర్ బాలప్పను అందరూ 'భళా.. బాలప్ప' అని కొనియాడుతున్నారు.

నారాయణఖేడ్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : కంగ్టి మండలం సిద్ధంగిర్గా గ్రామానికి చెందిన సాగర్ బాలప్ప తాపీమేస్త్రీ పని చేసేవారు. దశాబ్దం క్రితం పొట్ట చేతపట్టుకుని కర్ణాటక రాష్ట్రంలోని చింతాకి నాగన్‌పల్లికి వలస వెళ్లారు. అక్కడ తాపీమేస్త్రీ పని చేస్తూనే దత్తురావు అనే శిల్పి వద్ద సహాయకుడిగా చేరాడు. ఆయన శిక్షణలో శిల్పాలను చెక్కడం నేర్చుకున్నాడు. తనలో స్వతహాగా ఉన్న కళాకారుడికి సానపెట్టి అందమైన దేవతా విగ్రహాల తయారీకి కేరాఫ్‌గా మారాడు. గతంలో జిల్లా పరిధిలో ఎక్కడ ఆలయాలను నిర్మించినా.. జీర్ణోద్ధరణ పనులు చేపట్టినా దేవతా విగ్రహాలు, స్తంభాలు, గడప, తోరణాల తయారీ కోసం ఆంధ్రప్రదేశ్‌లోని అల్లగడ్డ, మహారాష్ట్రలోని పండరీపూర్, తమిళనాడులోని మహాబలిపురంతో పాటు రాష్ట్రంలోని ఖమ్మం, కరీంనగర్ జిల్లా రామడుగుకు వెళ్లేవారు. ప్రస్తుతం చుట్టుపక్కల జిల్లాలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా ఆలయాల నిర్మాణానికి బాలప్పనే సంప్రదిస్తున్నారు. ముందుగా ఆర్డర్ ఇచ్చి

మిగతా 8వ పేజీలో..

ఎన్నాళ్లో వేచిన కొలువు..

డీఎస్సీ-2008 అభ్యర్థుల నిరీక్షణకు తెర

సంగారెడ్డి జిల్లాలో 67 మందికి కాంట్రాక్టు టీచర్లుగా పోస్టింగ్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2008 అభ్యర్థుల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. టీచర్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు హైకోర్టు ఆదేశాల మేరకు విద్యాశాఖ ఎస్జీటీ కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా(2024-25) నియమించింది. ఈ మేరకు శనివారం సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో నియామక కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలలకు కేటాయించారు. సంగారెడ్డి జిల్లాలో 70 మందికిగాను 67 మందిని కౌన్సెలింగ్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు కేటాయిస్తూ పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. మిగిలిన ముగ్గురిలో ఒకరు కౌన్సిలింగ్‌కు గైర్హాజరవగా, మరో ఇద్దరు నాట్‌విల్లింగ్ ఆప్షన్ ఇచ్చారు. అదనపు కలెక్టర్ మాధురి, డీఈవో వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేశారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లు, ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌తో ఈ నెల 17న సంబంధిత మండల విద్యాధికారికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీ శంకర్, సూపరింటెండెంట్ సురేఖ, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, సీఎంవో వెంకటేశం, ఏసీ పండరి నాయక్ తదితరులు ఉన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో డీఎస్సీ-2008 అభ్యర్థికి కాంట్రాక్టు టీచర్‌గా నియామకపత్రాన్ని అందజేస్తున్న అదనపు కలెక్టర్ మాధురి, డీఈవో వెంకటేశ్వర్లు



జోగిపేట వద్ద పచ్చికబయలును తలపిస్తున్న మంజీరా నది

మంజీరాకు దారేదీ?

నది నిండా గుర్రపు డెక్క

కిలోమీటర్ల మేర విస్తరించిన హైసింత్ మొక్క

పంపుసెట్లలోకి వేర్లు చేరి నీటి సరఫరాకు అడ్డంకి

చేపలు, జలచరాలకు ముప్పు

తొలగించే వారే లేరు

ఇబ్బందుల్లో రైతులు

జోగిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గలగలా పరుగులు పెట్టే మంజీరా నది గుర్రపు డెక్కతో నిండిపోయింది. కిలోమీటర్ల మేర పచ్చని తివాచీ పరుచుకున్నట్లు విస్తరించిన ఈ నీటి మొక్క రైతులకు శాపంగా మారింది. సింగూరు ప్రాజెక్టు మొదలుకుని అందోలు నియోజకవర్గంలో 30 కిలోమీటర్ల మేర మంజీరా నది ప్రవహిస్తుంది. సింగూరు ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడు ఉధృతంగా ప్రవహించే నదిలో వర్షాకాలం పొడువునా ఎంతోకొంత ప్రవాహం కొనసాగుతుంటుంది. ఆ తర్వాత మడుగుల్లో చేరిన నీరే రైతుల సాగుకు ఆధారంగా ఉండేది. గత ప్రభుత్వం చౌటకూరు మండలం శివంపేట నుంచి టేక్మాల్ మండలం ఎలకుర్తి వరకు 30 కిలోమీటర్ల దూరం నదిలో 13 చెక్‌డ్యాంలను నిర్మించింది. దీంతో, ఏడాదంతా నదిలో నీరు నిల్వ ఉంటోంది. ఇంతవరకూ బాగానే ఉన్నా ఇటీవల గుర్రపుడెక్క నదిలో చేరి చెక్‌డ్యాంలు, మడుగులను మింగేస్తున్నది. ఎగువ నుంచి ప్రవాహంతో కలిసి వచ్చిన గుర్రపుడెక్క క్రమంగా నది పొడువునా విస్తరించింది. చెక్‌డ్యాంల నిర్మాణంతో శివంపేట నుంచి చిట్కుల్ వరకు నియోజకవర్గ పరిధిలో నదిలో 20 కిలోమీటర్లకు పైగా నీరు నిల్వ ఉన్నది. కానీ, అంతమేర ప్రస్తుతం గుర్రపుడెక్కతో నిండిపోయింది. ఈ మొక్క వేర్లు నీటిలో 4 మీటర్ల వరకూ విస్తరిస్తాయి. మంజీరాలో పంపుసెట్లు ఏర్పాటు చేసుకుని రైతులు కిలోమీటర్ల దూరం వరకు పైప్‌లైన్ వేసుకుని పంటలు పండిస్తుంటారు. ఈ నేపథ్యంలో రైతులు ఏర్పాటు చేసుకున్న పైపులు, వ్యవసాయ పంపుసెట్లలోకి గుర్రపుడెక్క వేర్లు విస్తరించడంతో నీటి సరఫరాకు ఇబ్బందిగా మారింది. నీటి సరఫరా

మిగతా 8వ పేజీలో..

మనస్సు దోచే బెల్లం చాయ్

- ఔషధ గుణాలు మెండు
- సంగారెడ్డి బైపాస్ రోడ్డుకు క్యూ కడుతున్న జనం 7



సీఆర్పీల కుటుంబాలకు న్యాయం చేయాలని ఆందోళన

- వరంగల్‌లో సీఎం ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్
- అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు 7

కోర్టు ఆదేశాలతో కొల్లూరు ప్లాట్ల వద్దకు ఓనర్స్ రాక

- పోలీసులను పిలిపించిన మున్సిపల్ అధికారులు
- వచ్చిన వెంటనే వెనక్కి పంపిన కమిషనర్ 7

తమ్ముడిని హత్య చేసిన అన్నకు రిమాండ్

7

బడి పిల్లలకు మళ్లీ కంటి పరీక్షలు..

- రేపటి నుంచి మార్చి 15 వరకు ..
- పోయిన విడతలో 4792 మంది విద్యార్థుల్లో దృష్టిలోపాలు గుర్తింపు
- వారికే మరోసారి కంటి పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు



(ఫైల్)

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సర్కారు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మరోసారి కంటి పరీక్షలు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. 'స్కూల్ ఐ స్క్రీనింగ్ ప్రోగ్రాం' కింద ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు అందాయి. ఇందుకనుగుణంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాచరణ రూపొందించింది.

గతంలో గుర్తించినవారికే..

ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది ఏప్రిల్ 8 నుంచి 23 వరకు.. తిరిగి ఆగస్టు 20 నుంచి నవంబరు 29 వరకు రెండు విడతల్లో 'స్కూల్ ఐ స్క్రీనింగ్' కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు. 78 రోజుల పాటు సంగారెడ్డి జిల్లాలోని ట్రైబల్, సోషల్ వెల్ఫేర్ స్కూళ్లలో 1 నుంచి 10వ తరగతి వరకు, అన్ని సర్కారు పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి వరకు 93,563 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 4,792 మందికి దృష్టి లోపాలున్నట్లు గుర్తించారు. ఇందులో బాలురు 1,605 మంది, బాలికలు 3,187 మంది ఉన్నట్లు లెక్కతేల్చారు. వీరందరికి మరోసారి పరీక్షలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది.

ఐదు ఆస్పత్రుల్లో ఏర్పాట్లు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి మార్చి 15 వరకు బడి పిల్లలకు మరోసారి కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు టీవీవీపీ పరిధిలోని జోగిపేట, పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రుల్లో పరీక్షలు చేయనున్నారు. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం మొబైల్ హెల్త్‌టీమ్ వాహనాల్లో నిత్యం 50 మంది చొప్పున బడి పిల్లలను ఆయా ఆస్పత్రులకు తరలించి పరీక్షలు చేస్తారు. తాజా స్క్రీనింగ్ తరువాత అవసరమైన వారికి కళ్లద్దాలు కోసం సిఫారసు చేస్తారు.

ఏర్పాట్లు పూర్తిచేశాం

విద్యార్థుల్లో దృష్టి లోపాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో వైద్య ఆరోగ్యశాఖ స్కూల్ ఐ స్క్రీనింగ్ కార్యక్రమం పేరిట గతంలో కంటి పరీక్షలు నిర్వహించాం. సమస్యలను కచ్చితంగా గుర్తించేందుకు మరోసారి పరీక్షలు చేయాలని ఆదేశాలను వచ్చాయి. ఇందుకోసం ఐదు ఆస్పత్రుల్లో ఏర్పాట్లు పూర్తి చేశాం.

-డా.శశాంక్‌దేశ్‌పాండే, ఆర్‌బీఎస్‌కే సంగారెడ్డి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

లంబాడాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ 286వ జయంతిని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పట్టణంలో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. యాత్రలో మహిళల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

-జహీరాబాద్





సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపర్చండి: కలెక్టర్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపర్చాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద 44 పాఠశాలలకు క్రీడలు, నైపుణ్యాభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన అభ్యాస వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఈఈ జగదీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- హైవేలపై బ్లాక్ స్పాట్లను గుర్తించండి
- కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, పోలీసులు, వివిధ శాఖల అధికారులతో రోడ్డు భద్రతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో హైవే ఎన్‌హెచ్-44, హైవే 765-డీ లపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించాలని సూచించారు. చౌరస్తాల వద్ద రంబుల్‌స్ట్రిప్స్, స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రద్దీ ప్రదేశాల్లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని, యూటర్న్‌ల వద్ద బ్లింకర్స్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జంక్షన్ల వద్ద ఏఎన్‌పీఆర్ కెమెరాలను, సీసీ, కెమెరాలను ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు జరిగే అవకాశమున్నచోట సైన్‌బోర్డ్‌లు, రేడియం స్టికర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. తరచుగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం నార్కోటిక్ కో-ఆర్డినేషన్ జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్, ఎస్పీ పాల్గొని పలు అంశాలపై సూచనలు చేశారు. గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్, ఎస్పీ

సర్వేలో పాల్గొనని వారికి మరోసారి అవకాశం

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేలో పాల్గొనని వారికి నేటి ఆదివారం నుంచి ఈ నెల 28 వరకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ వెల్లడించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీట్ ద్వారా మాట్లాడి సర్వే వివరాలు తెలుసుకున్నారు.

వాహనం కాల్వలో పడి రైతు మృతి


పరశురాములు (ఫైల్)

మిరుదొడ్డి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం కాల్వలో పడి రైతు మృతిచెందిన సంఘటన శనివారం అక్బర్‌పేట-భూంపల్లి రుద్రారం గ్రామశివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పార పరశురాములు(36) శుక్రవారం రాత్రి వ్యవసాయపొలం వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి కాల్వలో పడడంతో మృతి చెందాడు. తెల్లవారినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకగా కాల్వలో అతడి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పొలంలో జారి పడి..

చిన్నశంకరంపేట్ ఫిబ్రవరి(ఆంధ్రజ్యోతి) 15: పొలం కిందపడి యువ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని అంబాజిపేటలో శివారులో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చందంపేట గ్రామానికి చెందిన తుడుం రాజు (35) అంబాజిపేట శివారులోని పొలానికి నీరు పెట్టేందుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు గట్టుపై నుంచి జారి పడి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..


జగన్నాథ్‌రావు మృతదేహం

చిలప్‌చెడ్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మండలం పరిధిలోని చిట్కుల్ చాముండేశ్వరి ఆలయ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం 11 గంటలకు ఆలయ సమీపంలోని వరిపొలంలో వ్యక్తి మృతదేహం ఉందని సమాచారం అందడంతో పోలీసులకు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తిగా భావించి వెంటనే అన్నీ పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా, హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ నివాసి పతంగా సంతోష్ తన తండ్రి పతంగే జగన్నాథ్‌రావు(60) అదృశ్యంపై శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తుండగా, ఇక్కడి మృతి చెందిన వ్యక్తి వివరాలను తెలిశాయి. దీంతో ఘటానా స్థలానికి చేరుకున్న సంతోష్ మృతుడు అతడి తండ్రిగా గుర్తించాడు. తన తండ్రి ఈ నెల 12న సాయంత్రం స్కూటీపై బయటికెళ్లి తిరిగి రాలేదన్నారు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసే క్రమంలో ఈ విషయం తెలిసిందన్నారు. 3 నెలల క్రితం తన తల్లి మృతిచెందగా, ఆమె అస్థికలు మంజీరా నదిలో కలిపామన్నారు. అందులో భాగంగానే మంజీరా నది ఒడ్డున గల చాముండేశ్వరి ఆలయం సమీపంలో తన తండ్రి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని భావిస్తున్నట్లు తెలిపారు. సంతోష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తమ్ముడిని హత్య చేసిన అన్నకు రిమాండ్

మునిపల్లి, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి) : సొంత తమ్ముడిని హత్య చేసిన అన్నను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చీలపల్లి గ్రామానికి శివయ్యను శుక్రవారం సాయంత్రం తన అన్న యాదయ్య హత్య చేసి పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం మండలంలోని బుదేరా చౌరస్తా వద్ద యాదయ్య పోలీసులను చూసి పారిపోతుండగా వెంటపడి పట్టుకున్నారు. విచారణలో శివయ్యను బండరాయితో కొట్టి చంపినట్లు ఒప్పుకోవడంతో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాజేష్ నాయక్ తెలిపారు. 12 గంటల్లోనే కేసును ఛేదించిన ఎస్‌ఐ రాజేష్‌ని, సిబ్బంది ఎండీ హనీఫ్, పాండు, తుకారాంలను కొండాపూర్ సీఐ వెంకటేశ్ అభినందించారు.

అక్రమంగా నిల్వ చేసిన 196 సిలిండర్లు స్వాధీనం


సిలిండర్లను స్వాధీనం చేసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

జహీరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ చేసిన సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మొగుడంపల్లిలో ఓ గ్యాస్ డీలర్ దుకాణం పక్కన ఉన్న షెటర్లలో కొందరు భారత్, ఇండియన్ కమర్షియల్ సిలిండర్లు అక్రమంగా నిల్వచేసి వ్యాపారస్థులకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. సమాచారం అందుకున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాలశాఖ అధికారులు శనివారం ఆయా దుకాణాలపై దాడులు నిర్వహించి మొత్తం 196 సిలిండర్లను స్వాధీనం చేసుకుని బాధ్యులపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లై అధికారులు స్వరూప, షాజొద్దీన్, బస్వరాజ్, ఆర్ఐ. సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మనస్సు దోచే.. బెల్లం చాయ్

● ఔషధ గుణాలు ఉన్న బెల్లం-టీ కోసం జనం క్యూ
● బెల్లం ఛాయ్ తాగేందుకు టీ ప్రియుల ఆసక్తి
● సంగారెడ్డి బైపాస్ రోడ్డులో లభ్యం





సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఉషోదయంతో పాటు లేచిన ప్రజలకు వేడి వేడి టీ గొంతులో పడితేనే ఆ రోజు ప్రారంభం కాదు. టీ(చాయ్)ని ఆరో ప్రాణంగా భావించే వారు కోకొల్లలు. నలుగురు మిత్రులను ఏకం చేసే సత్తా 'టీకి ఉంది. ఇందులో ఉన్నో రకాలు ప్రజల్లోకి చేరి పసందైన రుచితో అలరిస్తున్నాయి. 'టీ' లందు బెల్లం టీ రుచే వేరయా' అన్నట్టుగా ఇప్పుడు సంగారెడ్డి వాసులను కొత్త రకం బెల్లం టీ విశేషంగా ఆకట్టుకుంటున్నది. భిన్నమైన రుచితో గుమగుమలాడే వేడి వేడి బెల్లం చాయ్‌ని తాగేందుకు పట్టణ వాసులు ఉత్సాహం చూపుతున్నారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్ నుంచి తీసుకొచ్చిన బెల్లంతో తయారుచేసే టీకి మంచి గిరాకీ లభిస్తున్నది. ఇందులో ఔషధ గుణాలు కూడా మెండుగానే ఉన్నాయని ప్రజలు భావిస్తున్నారు. మధుమేహం, ఇతర జబ్బులు ఉన్న వారు చక్కెర వినియోగం తగ్గించుకోవాలని డాక్టర్ల హెచ్చరికలు ఉండడంతో ప్రత్యామ్నాయంగా బెల్లం టీని ఎంపిక చేసుకుంటున్నారు. దీనివల్ల శ్వాస వ్యవస్థ శుద్ధి, వ్యాధి నిరోధకత, శరీరంలోని వ్యర్థాల తొలగింపు, జీర్ణవ్యవస్థకు మేలు చేసి మనస్సును ఉల్లాసభరితంగా ప్రశాంతంగా ఉంచడంతో పాటు ఉద్యోగం, పని, ఆలోచనల ఒత్తిడితో అలసిపోయిన శరీరానికి ఎన్నో సుగుణాలు ఉన్న బెల్లం టీ స్వాంతన నిస్తుందని ఆయుర్వేద గ్రంథాలు, వైద్యులు సూచిస్తున్నారు. చక్కటి ఆరోగ్యాన్ని పంచే ఈ బెల్లం చాయ్‌ని సంగారెడ్డి బైపాస్ రోడ్డులో ఇద్దరు స్నేహితులు కనకదుర్గా టీ స్టాల్ పేరిట హోటల్‌ను ఏర్పాటు చేసి టీ-ప్రియులకు పరిచయం చేసి అందరిని ఆకట్టుకుంటున్నారు. సంగారెడ్డితో పాటు సమీప ప్రాంతాల ప్రజలు, జాతీయ రహదారి వెంట ప్రయాణిస్తున్న ప్రయాణికులు బెల్లం-టీ తాగేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటు సంగారెడ్డి వైపు వస్తే మీరు కూడా బెల్లం చాయ్ రుచి చూడండి.

డంపుయార్డు ముట్టడికి యత్నం

● అడ్డుకున్న పోలీసులు
● భారీ ఆటో ర్యాలీ తీసిన మహిళలు, జేఏసీ నాయకులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 15 (ఆంధ్యజ్యోతి) : ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటును మానుకోవాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళనలు మరింత ఉధృతంగా సాగుతున్నాఇ. శనివారం జేఏసీ కన్వీనర్ జైపాల్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు అమ్మగారి సదానందరెడ్డి అధ్వర్యంలో గుమ్మడిదలలో మైనార్టీ సోదరులు రిలే నిరహార దీక్ష చేపట్టగా, నల్లవల్లి, కొత్తపల్లిలో అర్ధనగ్న ప్రదర్శనలు, ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరం, మహిళా సంఘాల నేతృత్వంలో మహిళలు డంపుయార్డు ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే నిరసనలను మరింత తీవ్రతరం చేస్తామని రైతు జేఏసీ నేతలు హెచ్చరించారు.



ఆటోలతో నిరసన తెలుపుతున్న మహిళలు, రైతులు

డంపుయార్డు ఏర్పాటును రద్దు చేయండి : సీపీఎం

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు హానీ కలిగించే డంపుయార్డు ఏర్పాటును రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా పర్యావరణానికి ముప్పు కలిగించే డంపింగ్ యార్డు నిర్మాణం సరైందికాదన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, నాయకులు మాణిక్యం, రాజయ్య, రాంచందర్, నర్సింలు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత్తు చాక్లెట్లపై అప్రమత్తంగా ఉండాలి

● యాంటీ నార్కోటిక్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి డీఎస్పీ పుష్పన్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎస్పీ పుష్పన్‌కుమార్

కౌడిపల్లి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి)15 : కొంతమంది విద్యార్థులకు చాక్లెట్ల రూపంలో గంజాయిని విక్రయిస్తూ మత్తుకు బానిసలుగా మారుస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని యాంటి నార్కోటిక్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి డీఎస్పీ పుష్పన్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని తునికి గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ హరిబాబు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదర్థాలు విక్రయిస్తే వెంటనే 1908కు కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు. ఎస్ఐ రంజిత్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎన్‌హెచ్‌పై పెట్రోల్ ట్యాంకర్ బోల్తా

● తృటిలో తప్పిన ప్రమాదం



కంది, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రమైన కంది శివారులో ఓ పెట్రోల్ ట్యాంకర్ బోల్తాపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం మహరాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ పెట్రోల్ ట్యాంకర్ డ్రైవర్ కంది శివారులో ముందున్న లారీని ఓవర్‌టెక్ చేయడానికి యత్నించాడు. ఈ క్రమంలో ట్యాంకర్ అదుపుతప్పి రోడ్డు మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న అండర్‌డ్రైనేజీలో బోల్తాపడింది. డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఆ ట్యాంకర్ నుంచి పెట్రోల్ లీక్ కాకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సమచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు, ఫైర్ సిబ్బంది ట్యాంకర్‌లోని పెట్రోల్‌ను పైపలద్వారా వేరే ట్యాంకర్‌లోకి సురక్షింతగా నింపారు.

కోర్టు ఆదేశాలతో ప్లాట్ల వద్దకు ఓనర్స్

● పోలీసులను బందోబస్తు కోరిన మున్సిపల్ అధికారులు
● వచ్చిన వెంటనే వెనక్కి పంపిన కమిషనర్



ప్లాట్ల వద్ద గుమిగూడిన ప్లాట్ ఓనర్స్

రామచంద్రాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు గ్రామంలో నాలుగు దశాబ్దాలుగా వివాదాలతో కూడిన ప్లాట్ల అంశం మరో మారు తెరపైకి వచ్చింది. కొల్లూరులోని సర్వే నంబరు 176లోని ప్లాట్లు తమవంటూ కొందరు వ్యక్తులు కోర్టు ఆదేశాలతో శనివారం ప్లాట్ల వద్దకు వచ్చారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ ప్లాట్ ఓనర్స్ పెద్ద సంఖ్యలో ఉండటంతో పోలీసులు బందోబస్తు కల్పించాలంటూ కొల్లూరు పోలీసులకు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న వెంటనే సీఐ రవిందర్ ఆదేశాలతో ఎస్ఐ రమేశ్ పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అంతలోనే ఏం జరిగిందో, మతలబు ఏంటో తెలియదు కానీ కమిషనర్ సంగారెడ్డి ఇప్పుడు బందోబస్తు అవసరం లేదని తాను జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన తరువాత మరోమారు మిమ్మల్ని పిలుస్తానంటూ చెప్పడంతో పోలీసులు వెనక్కి తిరిగారు. కమిషనర్, అధికారులతో మాట్లాడిన కొనుగోలుదారులు కోర్టు ధ్రువపత్రాలను చూపి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

విద్యార్థిదశ నుంచే నైపుణ్యం పెంపొందించుకోవాలి

● అగ్రికల్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ సీహెచ్ విద్యాసాగర్

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. సిహెచ్. విద్యాసాగర్ అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ముడు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడలు శనివారం అట్టహాసంగా ముగిసాయి. ఈ సందర్భంగా డాక్టర్ సిహెచ్. విద్యాసాగర్ మాట్లాడుతూ క్రీడా పోటీల్లో పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని గెలుపు దిశగా పయనించాలని కోరారు. చదువు, ఉన్నత ఉద్యోగం మాత్రమే జీవితానికి సరిపోదని, అదనపు రంగాల్లోనూ ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. అనంతరం అతిదులందరికీ ప్రిన్సిపాల్ డా. శ్రీదేవి సన్మానించి, జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పలు పాలిటెక్నిక్ కళాశాలల ప్రొఫెసర్లు, క్రీడాకారులు, తోర్నాల వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రొఫెసర్లు, విద్యార్థులు, వ్యవసాయ పరిశోదన, విస్తరణ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు



విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తున్న అధికారులు

మృతిచెందిన సీఆర్పీల కుటుంబాలకు
న్యాయం చేయాలని ఆందోళన

● వరంగల్‌లో సీఎం ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్
● అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలింపు



తూప్రాన్ ఆసుపత్రి వద్ద సీఆర్పీల ఆందోళన

తూప్రాన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్పీలు రమేశ్‌నాయక్, ఎర్ర శ్రీనివాస్ కుటుంబాలకు న్యాయం చేయాలని సీఆర్పీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మృతదేహాలను స్వగ్రామాలైన గొల్లపల్లి జెత్రంతండా, చందాయిపేటకు తరలించకుండా తూప్రాన్ ఆస్పత్రి వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన కారులను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం సీఆర్పీల మృతదేహాలను స్వగ్రామాలకు తరలించారు. ఈ సందర్బంగా సీఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి సహదేవ్ మాట్లాడుతూ మృతుల కుటుంబీకులకు రూ. 30లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఆర్పీలకు ఉద్యోగ భద్రతపై వరంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు.

ఆటో డ్రైవర్ ఇంటి ఎదుట మృతదేహంతో నిరసన

చేగుంట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : పోస్టుమార్టం అనంతరం చందాయపేటకు తరలించిన సీఆర్పీ శ్రీనివాస్ మృతదేహాన్ని శివునూరు గ్రామానికి తీసుకెళ్లి ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ స్వామి ఇంటిముందు ఉంచి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు తీసేది లేదని మొండికేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పి ఆందోళనవిరమింప జేశారు. సుమారు 6 గంటల మృతదేహాన్ని ఇంటిముందు ఉంచారు. కాగా, మృతి చెందిన సీఆర్పీల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ పేర్కొన్నారు. శనివారం సీఆర్పీల మృతదేహాలకు నివాళులర్పించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇదిలా ఉండగా డీఈవో ఆదేశాల మేరకు చేగుంట ఎంఈవో నీరజ సీఆర్పీల అంత్యక్రియల కోసం తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున అందజేశారు.



సస్య రక్షణతో
అధిక దిగుబడులు

● వరి సాగులో మెళకువలు
● వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు మీకోసం

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): యాసంగి వరిసాగులో సమగ్ర సస్య రక్షణ విధానం ద్వారా రైతులు మంచిదిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మగాని వరిలో ఉదా మొదలైన ఏక గడ్డిజాతి మొక్కలు, వరిలో కాండం తొలుచు పురుగు, లేత పసుపు పచ్చని పురుగులు అంకురాన్ని ఆశించడం, సుడిదోమ, అగ్గి తెగలు వంటి లక్షణాలు ఈ సీజన్ లో కనిపిస్తూ ఉంటాయి. వీటిని నాశనం చేయడంలో పలు రకాల పద్ధతులు పాటిస్తే రైతులు మంచి దిగుబడి ఉంటుందని చెబుతున్నారు.

కలుపు యాజమాన్యం

మాగాణి వరిలో ఊద మొదలైన ఏక వార్షిక గడ్డిజాతి మొక్కలు ఉన్నప్పుడు ప్రిటిలాక్లోర్ 50శాతం 500 మి.లీ. లేదా బెంథియోకార్బ్ 50శాతం 1.5 నుండి 2.0 మి.లీ లలో ఏదో ఒక దానిని ఎకరాకు 25 కిలోల పొడి ఇసుకలో కలిపి నాటిన 3 నుండి 5 రోజులలో పలుచగా నీరు పెట్టి సమానంగా చల్లాలి.

వరిలో కాండం తొలుచు పురుగు

రెక్కల పురుగు ఆకుల కింది భాగంలో గుడ్లు పెట్టి కాండాన్ని తొలుస్తుంది. తద్వారా వరిలో తెల్లకంకులు ఏర్పడం జరుగుతుంది లేత దశలో ఈ పురుగు వల్ల దుబ్బులోని కంకులు దెబ్బతింటాయి. ఇందుకు గాను రైతులు నాటువేసిన 15-20 రోజులలో 8 కిలోల కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 4జి గుళికలని చల్లుకోవాలి.

ఉల్లికోడు

లేత పసుపుపచ్చని పురుగులు అంకురాన్ని ఆశించడం వల్ల ఉల్లికాడ లాంటి పొడవాటి గొట్టాలు పొలంలో కనిపిస్తాయి ఇందుకుగాను రైతులు విత్తినానంతరం పది కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు లేదా ఫోరెట్ 5కిలోలు నాటిన 10 రోజుల్లో చల్లుకోవాలి.

సుడిదోమ

గోధుమ రంగులో గాని లేదా బూడిద రంగులో గాని ఉండే పురుగులు మొక్క మొదళ్ల వద్ద రసాన్ని పీల్చి వేయడం వల్ల కాండం బలహీనపడిపోయి సుడులుగా ఎండిపోతాయి. ఇందుకు గాను రైతులు కుదురుకు 15-20 పురుగులను గమనించినట్లయితే అసిపేట్ 1.5గ్రాములు లేదా ఎథ్ పెన్ ప్రాక్స్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి చల్లుకోవాలి. లేదా 120 గ్రాముల పైమెట్రిజిన్‌ను 150 లీటర్ల నీటిలో కలిపి చల్లుకోవాలి.

తెగుళ్ల యాజమాన్యం

మన ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులను బట్టి యాసంగిలో చిరుపొట్ట దశలో అగ్గితెగులు లక్షణాలను గమనిస్తూ వున్నాము. ఆకుల పై ముదురు గోధుమ రంగు అంచుతో మధ్యలో బూడిద రంగుగల నూలుకండే ఆకారపు మచ్చలు ఏర్పడతాయి. ఆకులు ఎండిపోయి తగులబడినట్లు కనిపిస్తాయి.

పోషక యాజమాన్యం

యాసంగి వరిలో చలి తీవ్రత అధికంగా ఉండటం వల్ల పైరు పోషకాలను సమర్థవంతంగా వినియోగించుకోలేదు. ప్రత్యేకించి జింక్ లోప లక్షణాలు అధికంగా అగుపడుతాయి ఇందుకు గాను రైతులు 3పంటలకు ఒకసారి 20కిలోల జింక్ సల్ఫేట్ ను ఆఖరి దుక్కిలో చల్లుకోవాలి. యాసంగిలో పశువుల పేడ లేదా కోళ్ల, మేకల, గొర్రెల ఎరువును పొలంలో వాడుకుంటూ ఉండాలి.

అవగాహన కల్పిస్తున్నాం..

యాసంగి వరి సాగులో సస్య రక్షణ చర్యలపై ఇప్పటికే మండలంలో ఆయా గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇంకా పంటల పైన ఏమైనా సందేహాలు ఉంటే రైతులు నేరుగా మండల వ్యవసాయ కార్యాలయంలో కానీ, ఆ శాఖ అధికారులు కానీ సంప్రదించవచ్చు.

-శ్రీనాథ్,
మండల వ్యవసాయ శాఖ అధికారి

ఏటీఎంలో రూ.2.50లక్షలు చోరీ

జహీరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని భవానిమందిరం వద్ద గల ఎస్‌బీఐ ఎటీఎంలో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. పట్టణ ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం భవానిమందిర్ వద్ద గల ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.2,50లక్షలు ఎత్తుకెళ్లారు. శనివారం సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. ఎటీఎంను కటర్‌లతో కట్‌చేసి నగదు తీసుకెళ్లినట్లు గుర్తించారు. క్లూస్‌టీంని రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. జహీరాబాద్‌కు ఆనుకుని ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌లో ఇటీవల జరిగిన ఏటీఎం దోపిడి ఘటన నుంచి తేరుకోకముందే జహీరాబాద్ పట్టణంలోని ఏటీఎంలో దొంగతనం జరగడం చర్చనీయాంశంగా మారింది.

క్రైం కార్నర్

కారు, ఆటో ఢీ, నలుగురికి గాయాలు

నారాయణఖేడ్ ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో సమీపంలో 161బీ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు విద్యార్థులతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. నిజాంపేట వైపు నుంచి నారాయణఖేడ్ వైపునకు వస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న మనూరు మండలం రానాపూర్‌కు చెందిన వంశీ(16), అదే గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న నారాయణఖేడ్ మండల చాప్టా(కే)కి చెందిన సచిన్(18)తో పాటు నారాయణఖేడ్ పటానికి చెందిన జ్యోతి(28), ర్యాలమడుగు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నారాయణ(30)కు గాయాలయ్యాయి. అటుగా వస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నగేష్ గాయాలైన వారిని ఆటోలో నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. సచిన్‌కు ఓ కాలుకు రెండుచోట్ల, మరో కాలుకు ఒక చోట విరగడంతో ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్య కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. గురుకుల ప్రిన్సిపాల్ లింగారెడ్డి ఆసుపత్రిని సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.

ఆటో బోల్తా, వ్యక్తికి తీవ్రగాయాలు

నిజాంపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ఆటో బోల్తాపడిన ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన నిజాంపేట మండలంలో శనివారం రాత్రి చోటుచేసుకున్నది. రామాయంపేటకు చెందిన అక్కల ప్రసాద్ తన ఆటోలో నిజాంపేట వైపు కిరాణం వస్తువులు తీసుకొస్తున్నాడు. ఈ క్రమంలో మండల పరిధిలోని నందిగామ శివారులో గల బ్రిడ్జి వద్ద కురాగానే ఎదురుగా వస్తున్న వాహనం వెలుతురు ఒక్కసారిగా పడడంతో దారి కనిపించగ ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న మరో వ్యక్తి సుదనమైన తిరుపతికి తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

పేకాట స్థావరంపై దాడి, కేసు

రేగోడు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై రేగోడు పోలీసులు దాడిచేసి శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ పోచయ్య వివరాల ప్రకారం.. రేగోడు బతుకమ్మ కుంట సమీపంలో పేకాట ఆడుతున్నట్టు నమ్మదగిన సమాచారం రావడంతో దాడిచేసి, ముగ్గురిని అదుపులోకి తీసుకుని, రూ.1,600 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒకరు పరారీలో ఉన్నారని ఎస్ఐ చెప్పారు.

విగ్రహాల ఊరేగింపు

ఝరాసంగం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచునూర్ గ్రామ శివారులో గల రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం జాతర నిర్వహించారు. ఇందులో భాగంగా గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నాగులు, నంది విగ్రహాలను పురవీధుల గుండా ఊరేగించారు.

ఆలయ నిర్మాణానికి రూ.1.20 లక్షల విరాళం

జిన్నారం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిన్నారంలో నిర్మిస్తున్న పోచమ్మ ఆలయం కోసం ఈదునాగులపల్లి మాజీ సర్పంచ్ రాములుగౌడ్ రూ.120 లక్షల విరాళాన్ని అందజేశారు. వెంకటేశంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



పటాన్‌చెరు ఎంపీపీ సమావేశ మందిరంలో నిర్వహించిన సేవాలాల్ జయంతిలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



సంగారెడ్డి రూరల్: సంగారెడ్డిలోని సేవాలాల్‌మహరాజ్ ఆలయంలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



శివ్వంపేటలో నిర్వహించిన సేవాలాల్ జయంతిలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ఘనంగా సేవాలాల్ జయంతి

బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్‌సేవాలాల్ బోధనలు ప్రతి ఒక్కరికి అనుసరణీయమని పలువురు పేర్కొన్నారు. శనివారం సేవాలాల్ మహరాజ్ 286వ జయంతిని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పూజలు చేసి, నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్



నిజాంపేటలో నిర్వహించిన సేవాలాల్ జయంతిలో పాల్గొన్న గిరిజన నాయకులకు కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో సంత్‌సేవాలాల్ జయంతి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్



సంగారెడ్డి అర్బన్ : సంగారెడ్డి జీజీహెచ్‌లో సేవాలాల్ జయంతి వేడుకల్లో ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంవో, బంజారా ఉద్యోగులు



నారాయణఖేడ్: హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్

ఆకుపచ్చ రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌దే

సంగారెడ్డి రూరల్/నర్సాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : హరితహారంతో రాష్ట్రాన్ని ఆకుపచ్చగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలలయంలో శనివారం మొక్కలు నాటి నీరు పోసి మాట్లాడారు. రాష్ట్ర సాధకుడు, మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా 17న వృక్షార్చన పేరుతో మూడు మొక్కలు నాటాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నక్క నాగరాజుగౌడ్, పార్టీ సంగారెడ్డి, కొండాపూర్ మండలాల అధ్యక్షుడు చక్రపాణి, మ్యాకం విఠల్, పట్టణ కార్యదర్శి నర్సింలు, గోవర్ధన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మున్నూరు విష్ణు, నాయకులు పాల్గొన్నారు. కేసీఆర్ జన్మదినం సందర్భంగా నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సునీతారెడ్డి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మోదీపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

- బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌గౌడ్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి మోదీపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు హుందాగా వెనక్కి తీసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గందమల్లే ఆనంద్ గౌడ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి చౌరస్తా సమీపంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ అగ్రవర్ణ కులస్తుడని, కన్వర్టెడ్ బీసీ అంటూ అవాక్కులు చెవాక్కులు మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. దేశంలో బీసీలందరూ కలిసి మూడోసారి మోదీని ప్రధానమంత్రిని చేశారని, బీసీల ఐక్యత వల్లే దేశంలో వివిధ రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు సీఎం రేవంత్‌రెడ్డికి లేదన్నారు. ఈ సమావేశంలో సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ భాను ప్రకాశ్, జిల్లా ఉపాధ్యక్షుడు పోచారం రాములు, కార్యదర్శి నాగరాజు, జిల్లా కార్యాలయ కార్యదర్శి విజయ్ కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు నాగరాజు, నాయకులు రాములు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలి

- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో అంకితభాంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. వార్షిక పునశ్చరణ మొబిలైజేషన్ శిక్షణలో భాగంగా సంగారెడ్డిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన పరేడ్‌లో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 305 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్ అధికారులు, సిబ్బందికి పదిహేను రోజుల పాటు ప్రాథమిక శిక్షణను గుర్తుచేస్తూ పలు అంశాల్లో మెళకువలపై తర్ఫీదునిచ్చామన్నారు. 15 రోజుల మొబిలైజేషన్ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రివార్డులు అందజేసి, సన్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఆర్ఐలు రామరావ్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఎస్పీ రూపేష్

సీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



కౌడిపల్లి పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 15 : మండల కేంద్రంలోని సీహెచ్‌సీని కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి, రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలోని వైద్యుల సేవలు సరిగ్గా లేవని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలోని వైద్యుల పనితీరును సీసీ కెమెరాల్లో జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

ఇప్పుడు కూడా పరిహారం ఇవ్వరా..?

- పట్టా భూములు కోల్పోయిన రైతుల ఆవేదన
- కోర్టు పరిధిలో భూమి ఉన్నా డ్రైనేజీ నిర్మాణం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండల పరిధిలోని తెల్లాపూర్ మున్సిపాలిటీ ఉస్మానగర్‌లో రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్ నుంచి గ్రామంలోకి సుమారు 40 ఫీట్ల రోడ్డు రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రోడ్డు కోసం తీసుకున్న భూమికి సంబంధించి రైతులకు ఎటువంటి పరిహారం చెల్లించలేదు. ఈ విషయమై గతేడాది ఆంధ్రజ్యోతి 'పట్టా భూములను ప్రభుత్వం కబ్జా' అనే కథనాన్ని ప్రచురించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో రైతులు పరిహారం ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. పలు వాదనల తరువాత ఈ అంశం కలెక్టర్ వద్దకు చేరింది. ఇది ఇలా ఉండగా ఇటీవల మున్సిపాలిటీ రైన్ వాటర్ డ్రైనేజీని పట్టా భూములు కలిగి ఉన్న రైతుల భూముల నుంచి చేపట్టింది. ఈ విషయంలో పరిహారం కాదు కదా కనీసం సమాచారం అధికారులు ఇవ్వలేదు. రైతుల అభివృద్ధి ప్రభుత్వానికి పట్టదా అంటూ నిలదీస్తున్నారు.

'సహకారనిధి డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

నారాయణఖేడ్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార బ్యాంకు వినూత్నంగా ప్రారంభించిన సహకారనిధి డిపాజిట్ పథకాన్ని బ్యాంకు ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ డీసీసీ బ్యాంకు మేనేజర్ వెంకటేశం కోరారు. శనివారం మండల పరిధిలోని పగిడిపల్లిలో సహకారనిధి పథకంపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ పథకం ద్వారా డిపాజిట్లు చేసుకునేవారికి అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్, పీఏసీఎస్ చైర్మన్ శోభాఅశోక్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈవో జగన్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

కక్షపూరితంగానే తనపై అభాండాలు

- టేక్మాల్ సొసైటీ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యశ్వంత్‌రెడ్డి

టేక్మాల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నట్లుగా సొసైటీలో ఎలాంటి అవినీతి జరగలేదని, తనపై కక్షపూరితంగానే ఆరోపణలు చేస్తున్నారని టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి పేర్కొన్నారు. సొసైటీలో రూ.21,34,933 లక్షల అవినీతి జరిగిందని, ఆ డబ్బులను రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారని, అవినీతికి పాల్పడిన చైర్మన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ శ్రేణులు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో యశ్వంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వీరప్ప, నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నట్లు సొసైటీలో ఎలాంటి అవినీతి జరగలేదన్నారు. సొసైటీకి సంబంధించిన పాత గోదాం రిపేరు, ప్రహరీ, సీసీ, నీటి సౌకర్యం కోసం వేసిన బోరు ఖర్చులను.. కొత్తగా నిర్మించిన భవనానికి సంబంధించిన బిల్లులో విచారణ అధికారులు చూపడం వల్లే తేడా వచ్చిందన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు.

నాణ్యతకు తిలోదకాలు

- తృటిలో తప్పిన ప్రమాదం



నేలకొరిగిన బటర్‌ఫ్లై లైట్ స్తంభం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని రేడియల్ రోడ్డు 7 ఎక్స్‌టెన్షన్ రోడ్డులోని డివైడర్‌లో ఏర్పాటు చేసిన బటర్‌ఫ్లై లైట్ స్తంభం గురువారం అర్ధరాత్రి ఒక్కసారిగా నేలకొరిగింది. ఆ సమయంలో రోడ్డుపై ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ స్తంభాన్ని రోడ్డు పైనుంచి తీసి మొక్కలపై పెట్టారు. దీంతో మొక్కలు విరిగి పనికిరాకుండా పోయాయి. గతేడాది జూలైలో రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ బటర్ ఫ్లై లైట్లను ప్రారంభించారు. ఏడాది కూడా ముగియకుండానే స్తంభం నేలకొరగడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని, నాణ్యతపై విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

'హోటళ్లలో చెత్తడబ్బాలు ఏర్పాటు చేసుకోవాలి'

నారాయణఖేడ్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : హోటళ్లలో తడి, పొడి చెత్తల కోసం వేర్వేరు డబ్బాలను ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అన్నారు. శనివారం మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్ల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హోటళ్ల నుంచి వెలువడే తడి, పొడి చెత్తలను వేర్వేరుగా డబ్బాల్లో వేసి హోటళ్ల వద్దకు వచ్చే చెత్త తరలింపు ఆటోల్లో వేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ వెంకట శివయ్య, శానిటేషన్ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నీటి కోసం ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



నీళ్లు పడాలని బోరుపాయింట్ వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కంది, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కందిలోని 4వ వార్డులో ఉన్న బోరు ఎండ తీవ్రతలకు వట్టిపోయింది. కాలనీ మాజీ వార్డుసభ్యుడు మహ్మద్ గౌస్ శనివారం తన సొంత ఖర్చుతో బోరును తవ్వించారు. ఆ కాలనీలో ఉన్న ముస్లింలంతా బోరుపడాలని, నీళ్లు త్వరగా రావాలని కోరుతూ అక్కడి దర్గా దగ్గర ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రానున్న వేసవిలో నీటి కష్టాల నుంచి తమను కట్టించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు జంగయ్య, మురళీధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, తయ్యాబ్, నాలుగో వార్డు కాలనీవాసులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆశీస్సులతో సంతోషంగా ఉండాలి

కొల్చారం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పెద్దమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. శనివారం కొల్చారం మండలం రాంపూర్ గ్రామంలో పెద్దమ్మతల్లి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఇందులో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్, శ్రీనివాస్, రాజు, గోవర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భళా.. బాలప్ప!

5వ పేజీ తరువాయి



రాళ్లను శిల్పాలుగా చెక్కుతున్న కళాకారుడు బాలప్ప

విగ్రహాలు చేయించుకుంటున్నారు. నాలుగు అడుగుల నుంచి పదడుగులకు పైగా విగ్రహాలను తయారు చేయించుకుంటున్నారు. తొమ్మిదేళ్లుగా ఖేడ్ శివార్లలో చిన్న షెడ్డు వేసుకొని విగ్రహాలు తయారుచేస్తున్నారు. హనుమాన్, దుర్గా మాత, పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, శివలింగాలు, నంది విగ్రహాల కోసం ఎక్కువగా ఆర్డర్లు వస్తున్నాయని బాలప్ప చెబుతున్నారు. ఆలయాల నిర్మాణానికి అవసరమయ్యే గడపలు, తోరణాలు, స్తంభాలు కూడా చెక్కి ఇస్తానని చెప్తున్నారు. విగ్రహం సైజును బట్టి రూ.8 వేల నుంచి రూ.40 వేల వరకు చార్జి చేస్తానని తెలిపారు. ఒక్కో విగ్రహం తయారు చేయడానికి సైజును బట్టి వారం నుంచి రెండునెలల వరకు పడుతుందని బాలప్ప తెలిపారు. విగ్రహాలను తయారు చేయడానికి అవసరమైన రాయిని ఖమ్మం, ఆంధ్రప్రదేశ్‌లోని ఆల్లగడ్డ నుంచి తీసుకువస్తామని బాలప్ప తెలిపారు. ఒక్కోసారి విగ్రహాలకు అవసరమైన రాయి, వాహనచార్జీలతో కలిపి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుందన్నారు.

సహకరిస్తే సత్తా చాటుతా

తాపీమేస్త్రీ పనికోసం వెళ్లిన చోట విగ్రహాలు చెక్కడం నేర్చుకున్నాను. ప్రస్తుతం ఖేడ్ శివారులో స్థలం అద్దెకు తీసుకుని షెడ్డు వేసుకొని పనిచేస్తున్నాను. విగ్రహాల తయారీకి అవసరమైన రాళ్లను ఇతర ప్రాంతాల నుంచి తెప్పిస్తున్నాను. ఇప్పటివరకు వందకుపైగా ఆలయాలకు అవసరమైన విగ్రహాలు, గడప, తోరణాలు అందజేశాను. ప్రభుత్వం సహాయం చేస్తే యంత్ర పరికరాలను కొనుగోలు చేసి మెరుగైన విగ్రహాలను తయారు చేయగలుగుతాను.

- బాలప్ప, శిల్పి, నారాయణఖేడ్

మంజీరాకు దారేదీ?

5వ పేజీ తరువాయి

నిలిచిపోయి పొలాలు ఎండిపోతున్నాయి. నదిలో దిగిన మనుషులు, జంతువులు ఈ వేర్లకు చిక్కి మృత్యువాతపడుతున్నారు. వేర్లు, ఆకులు కుళ్లిపోయి నీరంతా కలుషితమైపోతుంది. దోమలు, నత్తలు, పంటలకు హానిచేస్తే కీటకాలకు నెలవుగా మారుతున్నది. ఆక్సిజన్ అందక చేపలు మృత్యువాత పడుతున్నాయి. ఈ నీటిని తాగిన పశువులు రోగాలబారినపడుతున్నాయి.

పంపుసెట్లు పాడైపోతున్నాయి

గుర్రపుడెక్క వేర్లు విస్తరించడంతో పంపు సెట్లు, పైప్‌లైన్‌లు పాడవుతున్నాయి. మరమ్మతుల కుగురవడంతో పొలాలకు నీటి సరఫరా నిలిచిపోయి పంటలన్నీ ఎండిపోతున్నాయి. ప్రభుత్వం స్పందించి గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

-నర్సింహారావు కులకర్ణి, రైతు

చేపలు, జలచరాలు, పశువులకు ప్రాణాంతకం



గుర్రపుడెక్క నీటి ఉపరితలాన్ని కమ్మేయడంతో కింది భాగానికి సూర్యరశ్మిసోకక ఆక్సిజన్ శాతం తగ్గిపోతుంది. నీటిలో ఉండే చేపలు, జలచరాలకు సరిపడా ఆక్సిజన్ అందక మృత్యువాతపడతాయి. దోమలు వృద్ధి చెందుతాయి. నీరు కలుషితమై పశువులకు ప్రాణాంతకంగా మారుతున్నది. గుర్రపుడెక్కకు నీటిలోని లోహాలను సంగ్రహించి శోషణం చేసుకునే శక్తి ఉంటుంది. ఎగువ ప్రాంతాల నుంచి నదిలో కలిసే పారిశ్రామిక వ్యర్థాలు, డ్రైనేజీ నీటిలోని సీసం, కాపర్, ఆర్సెనిక్ హానికారక లోహాల అవశేషాలను ఈ మొక్క ఆకులు, వేర్లు శోషించుకుని నీటిని విషతుల్యంగా మరుస్తాయి. ఈ నీటిని తాగితే మూగజీవాలు, మనుషుల ప్రాణాలకే ప్రమాదం.

- రాహుల్ విశ్వకర్మ, 'ఏరువాక' శాస్త్రవేత్త